
Dr.G.Rajesh
CMD INB MEDIA GROUP

TRUTH | TRUST | IMPACT

INB TIMES

VOICE OF THE PEOPLE

INB TELUGU NEWS

ప్రచురణ : , తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ | సంపుటి : 03 | సంచిక : 122 | ఎడిటర్ : జి.రాజేష్ | బుధవారం 29 జులై 2026 | పేజీలు : 6 | వెల రూ. 4.00


# స్కైరూట్ ప్రతినిధులతో సీఎం భేటీ



- అత్యాధునిక పరిశ్రమలకు తెలంగాణ ప్రోత్సాహం
- విక్రమ్-1 విజయంపై ముఖ్యమంత్రికి వివరాలు
- అంతరిక్ష రంగంలో సహకార అవకాశాలపై చర్చ
- స్టార్టప్‌లకు ప్రభుత్వం పూర్తి

2లో

# అమరావతిలో జెనోమిక్ సొల్యూషన్ సెంటర్

- ఏపీ ప్రభుత్వంతో ఎంఓయూ కుదుర్చుకున్న ఆస్ట్రాజెనెకా ఇండియా
- దేశంలోనే మొదటి ప్రెసిషన్ అంకాలజీ పరిశోధనకు ఒప్పందం
- సీఎం చంద్రబాబు సమక్షంలో ఎంఓయూ కుదుర్చుకున్న ఫార్మా సంస్థ



అమరావతి, **ఐఎన్‌బిటైమ్స్**

కాన్సర్ రంగంలో జన్యుపరమైన పరిశోధనల ద్వారా వైద్య చికిత్సలను అందించేందుకు వీలుగా కీలకమైన ముందడుగు పడింది. అమరావతిలో ఇంటిగ్రేటెడ్ ప్రెసిషన్ అంకాలజీ విధానాన్ని ప్రారంభించేందుకు వీలుగా అంతర్జాతీయ ఫార్మాసుటికల్, బయో టెక్నాలజీ దిగ్గజ సంస్థ ఆస్ట్రాజెనెకా ఇండియా ఏపీ ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. అమరావతిలో ఇంటిగ్రేటెడ్ జెనోమిక్స్ సొల్యూషన్ సెంటర్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వంతో ఎంఓయూ కుదుర్చుకుంది. సీఎం చంద్రబాబు నాయుడు సమక్షంలో వైద్యారోగ్యశాఖ- ఆస్ట్రాజెనెకా ఇండియా సంస్థల ప్రతినిధులు ఒప్పందాలపై సంతకాలు చేశారు.

రిలయన్స్‌కు చెందిన స్ట్రాండ్ లైఫ్ సైన్సెస్, క్యూఆర్ఏఐ సంస్థలతో కలిసి ఆస్ట్రాజెనెకా ఇండియా ఇంటిగ్రేటెడ్ జెనోమిక్ సొల్యూషన్స్ సెంటర్ ఏర్పాటు చేయనుంది.

మిగతా 2లో

# గాజువాక భూమిని జప్తు నుంచి కాపాడేందుకు కృషి చేస్తాం

- ఉప సభాపతి, అసెంబ్లీ ఫిర్యాదుల కమిటీ ఛైర్మన్ కె.రఘురామకృష్ణ రాజురూ.2000 కోట్ల విలువైన
- భూమిని జప్తు నుంచి కాపాడేందుకు కృషి చేస్తాం
- ఉప సభాపతి,అసెంబ్లీ ఫిర్యాదుల కమిటీ ఛైర్మన్ కె.రఘురామకృష్ణ రాజు



అమరావతి,ఐఎన్‌బిటైమ్స్

విశాఖపట్నం జిల్లా గాజువాక నియోజకవర్గంలో దాదాపు రూ.2000 కోట్లు విలువ చేసే 174.43 ఎకరాల భూమిని బ్యాంకుల జప్తు నుంచి కాపాడేందుకు కృషి చేస్తామని ఉప సభాపతి, అసెంబ్లీ ఫిర్యాదుల కమిటీ ఛైర్మన్ కె.రఘు రామకృష్ణ రాజు వెల్లడించారు. మంగళవారం అసెంబ్లీ కమిటీ హాల్లో ఆయన అధ్యక్షతన ఫిర్యాదుల కమిటీ సమావేశం జరిగింది.అనంతరం అసెంబ్లీ భవనంలోని ఆయన చాంబరులో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఉప సభాపతి రఘురామ కృష్ణ రాజు మాట్లాడుతూ ఏపీ రిఫ్రాక్టరీస్ సంస్థ పరిశ్రమ నెలకొల్పేందుకు 1981లో రాష్ట్ర ప్రభుత్వం 174.43 ఎకరాల



# నేత్ర వైద్యానికి బలోపేతం

- ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రితో భాగస్వామ్యంపై సమీక్ష
- జిల్లా ఆసుపత్రుల్లో ఆధునిక నేత్ర
- చికిత్సల విస్తరణకు చర్యలు




# భోగాపురం ఎయిర్ పోర్టుతో ఉత్తరాంధ్ర కలలకు రెక్కలు

- ఆగస్టు 1న ప్రధాని చేతుల - మీదుగా ఏఎస్ఆర్ ఎయిర్ పోర్ట్ ప్రారంభం
-2,703 ఎకరాల విస్తీర్ణం, రూ.4,727 కోట్ల ప్రాజెక్టు.
-3,800 మీటర్ల రన్‌వే
-ఏటా 60 లక్షల మంది ప్రయాణికుల సామర్థ్యం

మిగతా 2లో

# రైతుకు సాంకేతికత చేరవేయడమే లక్ష్యం




2లో

- వందఏపిసోడ్లు పూర్తి చేసుకున్న రైతునేస్తం
- వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు

# జైపాల్ రెడ్డికి సీఎం రేవంత్ నివాళి



2లో

- వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పుష్పాంజలి
- ఢిల్లీలోని అధికారిక నివాసంలో నివాళు లర్పించిన ముఖ్యమంత్రి
- ఉత్తమ పార్లమెంటేరియన్ సేవలను స్మరించిన సీఎం

# ముడుమాల్ నిలువురాళ్లకు మరింత గుర్తింపు

- నిలువురాళ్ల పార్కు అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- వారసత్వ సంపద పరిరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం
- యునెస్కో శాశ్వత గుర్తింపు కోసం కృషి
- పర్యాటకాభివృద్ధితో స్థానికులకు ఉపాధి అవకాశాలు

మంత్రి వాకిటి శ్రీహరి



2లో

# కష్టకాలంలో రైతులకు అండగా ఉండాలి

- ఎల్ నినో యాక్షన్ ప్లాన్ అమల్లో నిర్లక్ష్యాన్ని సహించను
- తాగునీటి సమస్య తలెత్తకూడదు
- ప్రతి పంటకు బీమా నమోదు చేయించే బాధ్యత కలెక్టర్లదే
- నిరంతరం మానిటరింగ్ చేసేలా ఎల్ నినో కంట్రోల్ రూమ్
- ఎల్ నినోపై క్షేత్ర స్థాయి అంచనాలు, ప్రణాళికలు ఉండాలి
- ఆగస్టు 3 నుంచి ఎల్ నినోపై అవగాహన కార్యక్రమాలు
- సీఎం చంద్రబాబు



అమరావతి, **ఐఎన్‌బిటైమ్స్**

ఎల్ నినో కష్టకాలంలో రైతులను ఆదుకోవాలని, వారికి సరైన సమాచారాన్ని సహకారాన్ని అందిస్తూ అండగా నిలవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో ఎల్ నినో ప్రభావం, ప్రభుత్వ పరంగా తీసుకోవాల్సిన చర్యలు, రైతుల్లో కల్పించాల్సిన అవగాహనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమీక్షించారు. ఎల్ నినో ప్రభావం ఏ మేరకు ఉంటుంది. దీనికి సంబంధించిన యాక్షన్ ప్లాన్ వంటి అంశాలను సీఎం చంద్రబాబుకు అధికారులు వివరించారు. జూలై నెలలో 69 శాతం లోటు వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. వచ్చే మూడు

మిగతా 2లో

# భవిష్యత్‌లో పేపర్ లీకులకు అడ్డుకట్ట



- యాంటీ పేపర్ లీక్ బిల్లుపై మంత్రి జితేంద్ర సింగ్
- లీకులకు పాల్పడితే పదేళ్ల జైలు..పది కోట్ల జరిమానా
- గతంలో లీకులు జరిగినా చర్యలు తీసుకోని ప్రభుత్వాలు
- లోక్‌సభలో బిల్లుపై చర్చలో కేంద్రమంత్రి జితేంద్ర సింగ్

# ప్రజా పంపిణీ ద్వారా ప్రజలకు స్టీమ్ రైస్ అందేలా ఏర్పాట్లు



- 1000 మి. మార్గుల ఏర్పాటుకు కేంద్రం సహకారం
- రేషన్ బియ్యం లో 10 శాతం నూకల బియ్యం ఉండేలా చర్యలు
- ఢిల్లీ పర్యటనలో పౌర సరఫరాల శాఖామాత్యులు నాదెండ్ల మనోహర్

## రైతుకు సాంకేతికత చేరవేయడమే లక్ష్యం

హైదరాబాద్,జూలై28 రైతు చెంతకు నూతన సాంకేతికతే 'రైతునేస్తం' లక్ష్యమని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం రైతునేస్తం 100వ ఎపిసోడ్‌ను ప్రభుత్వం ఘనంగా నిర్వహించింది. సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి పాల్గొని ప్రసంగించారు. రైతు - శాస్త్రవేత్త - అధికారుల అనుసంధానానికి దేశంలోనే తొలి డిజిటల్ వేదిక రైతునేస్తమని అన్నారు. 2024 మార్చి 6న ప్రారంభమైన రైతునేస్తం.. నేడు 100 ఎపిసోడ్లు పూర్తి చేసుకుందని తెలిపారు. ఇప్పటివరకు 27.30 లక్షల మందికి పైగా రైతులకు ప్రయోజనం చేకూరినట్లు వెల్లడించారు. ప్రతి మంగళవారం రైతుల ప్రశ్నలకు ప్రత్యక్షంగా శాస్త్రవేత్తలు సమాధానాలు ఇస్తున్నారని మంత్రి తెలిపారు. ఎల్-నినో సవాళ్లను ఎదుర్కోవడంలో రైతునేస్తం కీలక పాత్ర పోషిస్తుందన్నారు. అధిక నీరు అవసరమయ్యే వరి సాగుపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు.
ఆయిల్ పామ్, ఉద్యాన, తక్కువ నీటితో సాగయ్యే పంటలపై దృష్టి సారించాలన్నారు. జులైలో 27 శాతం వర్షపాతం లోటు నమోదైందని వెల్లడించారు. ఆగస్టు 10 ప్రాంతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందన్నారు. భూగర్భ జలాల సమాచారాన్ని రైతులకు ఎప్పటికప్పుడు అందించాలని అధికారులను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. రైతునేస్తం కార్యక్రమంలో భాగంగా వివిధ జిల్లాలకు చెందిన ఆదర్శ రైతులను మంత్రి సన్మానించారు.

## ముడుమాల్ నిలువురాళ్లకు మరింత గుర్తింపు

నారాయణపేట ప్రతినిధి, జూలై 28
: చారిత్రక, సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని రాష్ట్ర క్రీడలు, పాడి పరిశ్రమాభివృద్ధి, పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి పేర్కొన్నారు. నారాయణపేట జిల్లా మక్తల్ నియోజకవర్గంలోని ముడుమాల్ గ్రామంలో ఉన్న చారిత్రక నిలువురాళ్ల పార్కు అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పార్కు అభివృద్ధి పనులను పరిశీలించిన మంత్రి, ఈ ప్రాంతాన్ని రాష్ట్రంలోనే ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. మంత్రి మాట్లాడుతూ చారిత్రక, సాంస్కృతిక వారసత్వ సంపదను కాపాడడంతో పాటు పర్యాటక కేంద్రాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ముడుమాల్ నిలువురాళ్ల పార్కును మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్ది, సందర్శకులకు అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించేలా అభివృద్ధి పనులు చేపడుతున్నామని చెప్పారు. పార్కులో రహదారులు, తాగునీరు, విశ్రాంతి సౌకర్యాలు, సమాచార కేంద్రాలు, సందర్శకుల సౌలభ్యానికి అవసరమైన ఏర్పాట్లు చేయనున్నట్లు వివరించారు.

## స్కైరూట్ ప్రతినిధులతో సీఎం భేటీ

ఢిల్లీ ప్రతినిధి, జూలై 28 : అత్యాధునిక సాంకేతిక పరిశ్రమలు, స్టార్టప్‌ల అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం అన్ని విధాలా ప్రోత్సాహం అందిస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఢిల్లీలో స్కైరూట్ ఏరోస్పేస్ సహ వ్యవస్థాపకుడు, ముఖ్య కార్యనిర్వహణ అధికారి పవన్ కుమార్ చందన, సహ వ్యవస్థాపకుడు, ముఖ్య నిర్వహణ అధికారి భరత్ డాకా ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి సంస్థ కార్యకలాపాలు, అంతరిక్ష రంగంలో సాధించిన విజయాలను వివరించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో ఏరోస్పేస్ రంగ అభివృద్ధిపై ఇరువర్గాలు విస్తృతంగా చర్చించాయి. సమావేశంలో స్కైరూట్ ఏరోస్పేస్ ప్రతినిధులు భారతదేశంలో ప్రైవేటు రంగం అభివృద్ధి చేసిన తొలి ఆర్బిటల్-తరగతి ప్రయోగ వాహనం "విక్రమ్-1"ను విజయవంతంగా ప్రయోగించిన విషయాన్ని ముఖ్యమంత్రికి వివరించారు. ఈ విజయంతో అమెరికా, చైనా తర్వాత ప్రైవేటు రంగం ద్వారా ఆర్బిటల్ ప్రయోగ సామర్థ్యాన్ని సాధించిన ప్రపంచంలోని మూడో దేశంగా భారత్ నిలిచిందని తెలిపారు. దేశ అంతరిక్ష రంగానికి ఇది చారిత్రాత్మక విజయమని పేర్కొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రుల్లో నేత్ర వైద్యానికి బలోపేతం

హైదరాబాద్ ప్రతినిధి, జూలై 28 : రాష్ట్ర ప్రభుత్వ ఆసుపత్రుల్లో నేత్ర వైద్య సేవలను మరింత బలోపేతం చేసే దిశగా ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రజలకు అందుబాటులో, నాణ్యమైన, సమాన వైద్య సేవలు అందించేందుకు పరస్పర సహకార అవకాశాలపై సమావేశంలో చర్చించారు. రాష్ట్రంలో 35 ప్రభుత్వ వైద్య కళాశాలలు ఉండగా, వాటిలోని నేత్ర వైద్య విభాగాలు ప్రత్యేక వైద్య సేవలు అందిస్తున్నాయని మంత్రి తెలిపారు. ఈ ఆసుపత్రుల్లో కంటి పరీక్షలు, దృష్టి కొలత సేవలు, శుక్లాల శస్త్రచికిత్సలు నిరంతరం నిర్వహిస్తూ ప్రతి ఏడాది వేలాది మంది రోగులకు చికిత్స అందిస్తున్నట్లు వివరించారు. రాష్ట్ర అత్యుత్తమ నేత్ర వైద్య కేంద్రంగా ఉన్న సరోజిని కంటి ఆసుపత్రిలో రెటీనా శస్త్రచికిత్సలు, లేజర్ చికిత్సలు, మెల్లకంటి శస్త్రచికిత్సలు, కార్నియా మార్పిడి, కంటి కణితుల చికిత్స, కనురెప్పల శస్త్రచికిత్సలు, గ్లాకోమా చికిత్సలు వంటి అత్యాధునిక సేవలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.

## గాజువాక భూమిని జప్తు నుంచి కాపాడేందుకు కృషి చేస్తాం

భూమిని కేటాయించగా చేయగా ఆ సంస్థ దివాలా తీయడంతో ప్రస్తుతం ఆ భూమి జప్తునకు గురయ్యే ప్రమాదం ఏర్పడిందన్నారు. ఏపి రిఫ్రాక్టరీస్ సంస్థ భూములు, విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ఆర్-కార్డులు(రీహాబిలిటేషన్ కార్డులు) అంశాలపై అసెంబ్లీ కమిటీ హాల్లో జరిగిన ఫిర్యాదుల కమిటీ సమావేశంలో సభ్యులందరితో కలిసి చర్చించామని పేర్కొన్నారు. దీనిపై ఆగస్టు మొదటి వారంలో ఉన్నతాధికారులు, బ్యాంకర్లతో మరోసారి ఫిర్యాదుల కమిటీ సమావేశం నిర్వహించి సమస్యను పరిష్కరించేందుకు ప్రయత్నం చేస్తామనన్నారు. ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, కొణతాల రామకృష్ణ, గురజాల జగన్ మోహన్, విష్ణు కుమార్ రాజు తో కలిసి అసెంబ్లీ భవనంలోని ఆయన చాంబరులో మీడియా నిర్వహించారు.

## కష్టకాలంలో రైతులకు అండగా ఉండాలి

నెలల్లో సరాసరి 35 నుంచి 40 శాత మేర లోటు వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందన్న అధికారులు జూన్ -- నవంబర్ మధ్య 844 మి.మీ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా 551 మి.మీ మాత్రమే నమోదయ్యే అవకాశం ఉందని వివరించారు. అంచనాలకు మించి ఎల్‌నినో ప్రభావం ఉండబోతోందని అధికారులు తెలిపారు. ప్రస్తుతానికి ఉన్న అంచనాల ప్రకారం అన్ని జిల్లాల్లోనూ ఎల్‌నినో ప్రభావం చూపిస్తోందని, ఎక్కువగా పశ్చిమ గోదావరి, ప్రకాశం, అన్నమయ్య, కృష్ణా, కడప జిల్లాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొంటాయని అధికారులు చెప్పారు. 2.78 లక్షల హెక్టార్లలో పత్తి, 1.07 లక్షల హెక్టార్లలో వరిపై ప్రభావం చూపిస్తుందని అధికారులు తెలిపారు. శ్రీకాకుళం జిల్లా పరిధిలోనే వరి పంటకు ఎక్కువ నష్టం వాటిల్లే అవకాశం ఉందని ముఖ్యమంత్రికి వివరించారు. వంశధార నుంచి జలాలు అందుబాటులోకి వస్తే వాటిని సద్వినియోగం చేసుకుంటూ పంటలను కాపాడాలని సీఎం సూచించారు. రాష్ట్రంలో 122 హై రిస్క్ మండలాలను గుర్తించామని అధికారులు సీఎంకు వివరించడంతో హై రిస్క్ మండలాల్లో బోరు ఆధారంగా పంటలను కాపాడుకునే అంశాన్ని పరిశీలించాలని ఆదేశించారు. ఆగస్ట్ 3 నుంచి అవగాహన కార్యక్రమాలు, వరికి ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి, అత్యవసర విత్తన ప్రణాళికను రూపొందించినట్లు అధికారులు తెలిపారు. కంది, ఆముదం, మినుము పంటలను ఇప్పటికే కొందరు ప్రత్యామ్నాయ పంటలుగా వేస్తున్నారని చెప్పారు. ఫసల్ బీమా యోజన, వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం కింద ఈ నెల 31వ తేదీ వరకు నమోదు ప్రక్రియ కొనసాగిస్తున్నామని అయితే వరి పంటకు ఆగస్ట్ 15 వరకు సమయం ఉందని అధికారులు వివరించారు. ఇప్పటి వరకు 6.30 లక్షల హెక్టార్ల మేర పంటలను బీమాలో నమోదు చేశామని అధికారులు తెలిపారు. దీనిపై ముఖ్యమంత్రి స్పందిస్తూ వేసిన ప్రతి పంటకు బీమా నమోదు చేయాల్సిందేనని ఏ పంటకైనా బీమా నమోదు చేయకపోతే దానికి కలెక్టర్లే బాధ్యత వహించాలని ముఖ్యమంత్రి హెచ్చరించారు. అలాగే తాగునీటి సమస్య ఉత్పన్నం కాకుండా చూసుకోవాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. పశుగ్రాసానికి ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టినట్లు అధికారులు వివరించారు. 5 నెలలకు సరిపడా 286.30 లక్షల మెట్రిక్ టన్నుల పశుగ్రాసం అందుబాటులో ఉంచామని అధికారులు చెప్పారు. అయితే 5 నెలలకు సరిపడా పశుగ్రాసం సిద్ధం చేసుకుంటే సరిపోదని, ఎల్ నినో ప్రభావం ఏడాది పొడవునా కన్పించే సూచనలు ఉండడంతో ఏడాదికి అవసరమైన పశుగ్రాసాన్ని అందుబాటులో ఉంచుకునేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

**ఎల్ నినోపై ప్రతివారం నివేదికలు..**

ఈ సమీక్ష సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసుకోవాలి. వరదలు, తుఫాన్లు వచ్చినప్పుడు ఎలా మానిటర్ చేశారో అదే విధంగా ఎల్ నినో అంశాన్ని మానిటర్ చేయాలి. పరిస్థితిని ఎప్పటికప్పుడు అంచనా వేయాలి. వచ్చిన డేటాను విశ్లేషించాలి.

## జైపాల్ రెడ్డికి సీఎం రేవంత్ నివాళి

న్యూఢిల్లీ ప్రతినిధి, జూలై 28 : కేంద్ర మాజీ మంత్రి, ఉత్తమ పార్లమెంటేరియన్ స్వర్గీయ ఎస్. జైపాల్ రెడ్డి వర్ధంతి సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఘనంగా నివాళులర్పించారు. ఢిల్లీలోని తన అధికారిక నివాసంలో ఏర్పాటు చేసిన జైపాల్ రెడ్డి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఆయన సేవలను స్మరించుకున్నారు. దేశ రాజకీయాల్లో, పార్లమెంటరీ వ్యవస్థలో జైపాల్ రెడ్డి అందించిన సేవలు చిరస్మరణీయమని ఈ సందర్భంగా గుర్తు చేశారు. సుదీర్ఘ రాజకీయ జీవితంలో ప్రజాసేవకు అంకితభావంతో పనిచేసిన జైపాల్ రెడ్డి దేశ రాజకీయాల్లో ప్రత్యేక గుర్తింపు పొందారని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ పార్లమెంట్‌లో తన వాగ్ధాటి, లోతైన అవగాహనతో అనేక అంశాలపై సమర్థవంతంగా తన అభిప్రాయాలను వినిపించిన నాయకుడిగా ఆయన చిరస్థాయిగా నిలిచారని తెలిపారు
.కేంద్ర మంత్రిగా పలు కీలక శాఖలను సమర్థవంతంగా నిర్వహించిన జైపాల్ రెడ్డి దేశాభివృద్ధికి విశేష కృషి చేశారని ముఖ్యమంత్రి కొనియాడారు. ప్రజా సమస్యలపై ఆయనకు ఉన్న అవగాహన, నిబద్ధత, పారదర్శకత నేటి తరానికి ఆదర్శంగా నిలుస్తాయని అన్నారు. తెలంగాణతో పాటు దేశవ్యాప్తంగా ఆయనకు లభించిన గౌరవం ఆయన వ్యక్తిత్వానికి నిదర్శనమని పేర్కొన్నారు. జైపాల్ రెడ్డి వర్ధంతి సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి. మహేష్ కుమార్ గౌడ్‌తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.
చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఆయనకు ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం ఆయన రాజకీయ, ప్రజాసేవా జీవితంలోని విశేషాలను స్మరించుకున్నారు.దేశ రాజకీయాల్లో మేధావి నాయకుడిగా గుర్తింపు పొందిన జైపాల్ రెడ్డి పార్లమెంటరీ సంప్రదాయాలను బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషించారని నాయకులు అభిప్రాయపడ్డారు.
ప్రజాస్వామ్య వ్యవస్థపై ఆయనకు ఉన్న నిబద్ధత, విలువలతో కూడిన రాజకీయాలు నేటి ప్రజాప్రతినిధులకు మార్గదర్శకంగా నిలుస్తాయని పేర్కొన్నారు. జైపాల్ రెడ్డి వంటి మహనీయుల ఆశయాలను కొనసాగించడం ప్రతి ప్రజాప్రతినిధి బాధ్యత అని ఈ సందర్భంగా పలువురు నాయకులు పేర్కొన్నారు. ప్రజాసేవే పరమావధిగా భావించి ఆయన నడిచిన మార్గం భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తుందని నివాళు లర్పించిన నాయకులు అన్నారు. ఆయన సేవలను తెలంగాణ ప్రజలు ఎప్పటికీ గుర్తుంచుకుంటారని పేర్కొన్నారు.

## అమరావతిలో జెనోమిక్ సొల్యూషన్ సెంటర్

అమరావతిలో దేశంలోనే మొట్టమొదటి ఇంటిగ్రేటెడ్ ప్రెసిషన్ అంకాలజీ చికిత్సా విధానాన్ని ప్రారంభించేందుకు ఈ ఎంఓయూ కుదుర్చుకున్నారు. ఊపిరితిత్తులు, రొమ్ము కాన్సర్ రోగుల కోసం అధునాతన జన్యు పరీక్షలు, బయోమార్కర్ టెస్టింగ్ చేసేందుకు వీలుగా ఇంటిగ్రేటెడ్ జెనోమిక్ సొల్యూషన్ సెంటర్‌ను ఆస్ట్రా జెనెకా ఏర్పాటు చేయనుంది. అమరావతి క్వాంటం వ్యాలీ- ఆస్ట్రా జెనెకా ఇండియా భాగస్వామ్యంతో ఇంటిగ్రేటెడ్ ప్రెసిషన్ అంకాలజీ చికిత్సా విధానాన్ని ప్రారంభించనున్నారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, నెక్ట్స్ జనరేషన్ సీక్వెన్సింగ్, ఆధునిక జన్యుచికిత్సా విధానాల్ని వినియోగించి కాన్సర్ ప్రారంభదశలోనే గుర్తించి శరీర తత్వానికి అనుగుణంగా చికిత్స అందించేలా ఈ ఇంటిగ్రేటెడ్ ప్రెసిషన్ అంకాలజీ విధానం ఉపకరించనుంది. ఊపిరితిత్తుల కాన్సర్ ను ముందుగా గుర్తించేందుకు ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ తో కూడిన ఎక్స్ రే ఆధారిత వ్యవస్థను ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఏర్పాటు చేయనుంది. తద్వారా రోగులను వేగంగా స్క్రీనింగ్, డయాగ్నోస్టిక్ సేవలు అందటం తో పాటు ఎలాంటి జాప్యం లేకుండా చికిత్స చేసేందుకు వీలుగా మార్గం సుగమం కానుంది.

**వైద్య రంగంలో పరిశోధనలకు క్వాంటంవ్యాలీ సేవలు..**

ప్రజలందరికీ అందుబాటులో అత్యాధునిక వైద్య సదుపాయాలను తీసుకురావటమే ఈ ఒప్పందం లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఫార్మా, బయో టెక్నాలజీ రంగాల్లో క్వాంటం పరిశోధనలు జరగాల్సి ఉందని సీఎం సూచించారు. కాలుష్యం లాంటి బాహ్య కారణాల వల్ల కూడా ప్రమాదకరమైన కాన్సర్ బారిన పడుతున్నారని ముందే గుర్తించి చికిత్సలు అందించటం ద్వారా రోగులకు ప్రయోజనం కలుగుతుందని అన్నారు. వైద్య రంగంలోని వ్యవస్థలు ప్రిడిక్టివ్, ప్రివెంటివ్, క్యూరేటివ్ విధానంలో పనిచేయాలని సీఎం సూచించారు. ఏపీలో సంజీవని ప్రాజెక్టు ద్వారా రాష్ట్రంలోని ప్రతీ పౌరుడి హెల్త్ ప్రొఫైల్ ను డిజిటల్ రికార్డులుగా కృషి మారుస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు.

## భోగాపురం ఎయిర్ పోర్టుతో ఉత్తరాంధ్ర కలలకు రెక్కలు

, జూలై 28 ఉత్తరాంధ్ర అభివృద్ధిలో మరో మైలురాయి ఆవిష్కృతం కానుంది. విజయనగరం జిల్లా భోగాపురంలో రూ.4,727 కోట్ల వ్యయంతో నిర్మించిన అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం వచ్చే నెల నుంచి వాణిజ్య కార్యకలాపాలకు సిద్ధమవుతోంది. ఆగస్టు ఒకటో తేదీన ఈ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రారంభించేందుకు ప్రధాని నరేంద్ర మోదీ భోగాపురం వస్తున్నారు. విమానాశ్రయ ప్రారంభోత్సవానికి అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నారు.
భోగాపురం ఎయిర్ పోర్టు ప్రారంభోత్సవాన్ని కూటమి ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఉత్తరాంధ్ర జిల్లాలకు ఈ ప్రాజెక్ట్ కీలకం కావడంతో ఈ ఎయిర్ పోర్టు ప్రారంభోత్సవానికి కూటమి సర్కార్ అత్యధిక ప్రాధాన్యత ఇస్తోంది. విశాఖను అంతర్జాతీయంగా అభివృద్ధి చెందిన నగరాల సరసన చేర్చేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోంది. ఎగుమతులు, నైపుణ్యాభివృద్ధి, పరిశోధనలకు కేంద్రబిందువుగా మారేలా అల్లూరి సీతారామ రాజు ఎయిర్ పోర్టుకు రూపకల్పన చేశారు

## ప్రజా పంపిణీ ద్వారా ప్రజలకు స్టీమ్ రైస్ అందేలా ఏర్పాట్లు

అమరావతి, జులై 28ప్రజాపంపిణీ వ్యవస్థలో ప్రజలకు స్టీమ్ రైస్ అందించడం ద్వారా వారికి పౌర సరఫరాల శాఖ సేవలను మరింత చేరువ చేయొచ్చు. దీనిద్వారా ప్రజలకు నాణ్యమైన బియ్యం అందడంతో పాటు, బియ్యం అక్రమ రవాణా నిరోధానికి ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది.
దీనికి కేంద్ర పౌర సరఫరాల శాఖ సహకారం ఎంతో అవసరం అని రాష్ట్ర పౌర సరఫరాల శాఖామాత్యులు నాదెండ్ల మనోహర్ చెప్పారు. రెండు రోజుల ఢిల్లీ పర్యటనలో భాగంగా ఆయన ఢిల్లీలో కేంద్ర పౌర సరఫరాల శాఖామాత్యులు ప్రహ్లాద్ జోషితో పాటు శాఖ ఉన్నతాధికారులను వరుసగా కలిశారు. నేషనల్ కోఆపరేటివ్ కన్స్యూమర్స్ ఫెడరేషన్ (ఎన్సీసీఫ్) ఎండీ అనీస్ జోసఫ్‌ని కలిసి రాష్ట్రంలో 1000 "మిమార్టు" ల ఏర్పాటుపై తగిన సహకారం కోరుతూ ఎంఓయూ చేసుకున్నారు. అనంతరం కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, ప్రజాపంపిణీ శాఖ జాయింట్ సెక్రటరీ రవిశంకర్, పాలసీ అండ్ ఎఫ్సీఐ జాయింట్ సెక్రటరీ శిఖాని కలిశారు. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో చేపట్టబోయే అంశాలపై చర్చించారు.
ఈ సందర్భంగా మనోహర్ సీఎంఆర్ సేకరణ, స్టీమ్ రైస్ పంపిణీ, మీ మార్టుల ప్రారంభం, రాష్ట్రం నుంచి విదేశాలకు ఎగుమతులు వంటి అనేక అంశాలను చర్చించారు. ఆగస్టు 1వ తేదీ నుంచి రాష్ట్రంలోని 130 రైతు బజార్లు, 500 ప్రత్యేక పాయింట్ల ద్వారా తక్కువ ధరకే బియ్యం విక్రయాలను చేపడుతున్న విషయాన్ని కేంద్ర మంత్రివర్యుల వద్ద మనోహర్ ప్రస్తావించారు. ఈ సందర్భంగా కేంద్రం నుంచి రావల్సిన అనుమతులు, సహకారం, పెండింగ్ నిధుల విషయాలను ప్రత్యేకంగా మంత్రివర్యుల ముందుంచారు. రాష్ట్రంలోని 41 వేల పాఠశాలలు,
4 వేల వసతి గృహాల్లో శ్రీమతి డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో స్టీమ్ రైస్ వాడకం ద్వారా అందుతున్న నా జిల్లాలో మొదలుపెట్టేలా అనుమతి ఇవ్వాలని కోరారు.

## భవిష్యత్‌లో పేపర్ లీకులకు అడ్డుకట్ట

న్యూఢిల్లీ,జూలై28
భవిష్యత్‌లో పేపర్ లీక్‌లు అరికట్టేందుకే యాంటీ పేపర్ లీక్ బిల్లును తీసుకువస్తున్నట్లు కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ స్పష్టం చేశారు. మంగళవారం యాంటీ పేపర్ లీక్ బిల్లుపై లోక్‌సభలో చర్చలో మాట్లాడుతూ.. దేశ చరిత్రలోనే ఈ చట్టం ఒక మైలురాయిగా నిలుస్తుందని జితేంద్ర సింగ్ అభివర్ణించారు. విద్యార్థుల భవిష్యత్ కోసం మోదీ కృషి చేస్తున్నారని వివరించారు. దేశవ్యాప్తంగా పేపర్ లీక్‌లు జరుగుతున్నాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ హయాంలోనూ ఆర్ఆర్‌బీ పేపర్ లీక్ అయ్యిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ పాలనలో ఎన్నోసార్లు పరీక్షా పత్రాలు లీకయ్యాయని మండిపడ్డారు. అయితే పరీక్షల నిర్వహణలో సంస్కరణలను కాంగ్రెస్ వ్యతిరేకించిందని తెలిపారు. 2010లో ఎన్‌టిఎ ఏర్పాటు విజ్ఞప్తిని కాంగ్రెస్ పట్టించుకోలేదని కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. నీట్ పరీక్షా పత్రం లీక్, విద్యా వ్యవస్థలో సంస్కరణలు తీసుకురావాలంటూ కాక్రోచ్ జనతా పార్టీ చేపట్టిన ఆందోళనలు తీవ్ర రూపం దాల్చడంతో కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్.. తన పదవికి రాజీనామా చేశారు. పేపర్ల లీకులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు కేంద్రం చర్యలు చేపట్టింది.
అందుకోసం 2024 నాటి ప్రవేశ పరీక్షల చట్ట సవరణ బిల్లును సోమవారం లోక్‌సభలో కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ ప్రవేశపెట్టారు. ఈ క్రమంలో విద్యార్థులు, యువత పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి పేపర్ లీక్ నిరోధక బిల్లు నిదర్శనమని జితేంద్రసింగ్ అన్నారు.

# డీఎస్సీ అక్రమాలపై నైతిక బాధ్యత విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాల్సిందే

## మాజీ శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్ మోహన్ రావు

ఐ ఎన్ బి టైమ్స్ విజయవాడ జూలై 28:

వై.యస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ యువజన మరియు విద్యార్థి విభాగాల ఆధ్వర్యంలో విజయవాడ నగరంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు.

డీఎస్సీ నియామకాల్లో అక్రమాలు, ఫీజు రియంబర్స్మెంట్ విధానం, నిరుద్యోగ భృతి, నీట్ పేపర్ లీకేజీ డిమాండ్ పై ఆందోళన చేసిన వైయస్ఆర్ కాంగ్రెస్ శ్రేణులు,ఈ సందర్భంగా మాజీ శాసనసభ్యులు డాక్టర్ మొండితోక జగన్ మోహన్ రావు మీడియాతో మాట్లాడుతూ

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మొన్న జరిగిన డీఎస్సీ అక్రమాలపై విచారణ జరపాలని రాష్ట్ర హైకోర్టు స్పష్టంగా ఆదేశించింది.తప్పుడు ధృవపత్రాలతో డీఎస్సీలో ఉద్యోగాలు స్పోర్ట్స్ కోటా పేరుతో అతిపెద్ద కుంభకోణం జరిగింది అని ఏ మాత్రం అర్హత లేని వారిని నకిలీ ధృవపత్రాలతో ఉద్యోగాలు పొందిన వారిని పాఠశాలల్లో మ్యాథమెటిక్స్ సైన్స్ టీచర్లు గానీ నియమిస్తే వారు విద్యార్థులకు ఏం బోధిస్తారు వీరి పాఠాలు విన్న విద్యార్థుల భవిష్యత్తు ఏమవుతుంది అని ప్రశ్నించిన మాజీ శాసనసభ్యులు డాక్టర్ మొండితోక జగన్ మోహన్ రావు ,లక్షలాది మంది టీచర్ అభ్యర్థుల భవిష్యత్తును గందరగోళం లోకి నెట్టిన మెగా డీఎస్సీ అక్రమాలపై హైకోర్టు స్పందించింది అన్ని ఆధారాలతో డీఎస్సీ అభ్యర్థులు హైకోర్టులో పిల్ వేశారు పిటిషన్ లో ప్రస్తావించిన అంశాలను పరిగణలోకి తీసుకొని డీఎస్సీ అక్రమాలపై విచారణ జరపాలని హైకోర్టు తేల్చిచెప్పింది.కేంద్రంలో ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా తరహాలోనే రాష్ట్రంలో కూడా నారా లోకేష్ నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాల్సిందే

పేపర్ లీక్ కు పక్కా ఆధారాలు ఉన్నాయి- అడ్డగోలుగా పోస్టులు అమ్ముకున్నారు - అందుకోసం ఏకంగా జీవో లు తెచ్చారు.అడ్డంగా దొరికిపోయిన బాధ్యత వహించరా,దేశంలో జెన్ -జీ తరహా ఉద్యమం. జరిగింది. విద్యార్థి, యువత, నిరుద్యోగులు రోజుల పాటు ఆందోళన చేపట్టి కేంద్ర ప్రభుత్వం మెడలు వంచారు. కేంద్ర ప్రభుత్వంలో అధికారంలో ఉన్న బిజెపి తన మంత్రి తో ఏ విధంగా రాజీనామా చేయించిందో అదే తరహాలో రాష్ట్రంలో కూటమిలో భాగస్వామ్య ఉన్న బిజెపి కూడా స్పందించి రాష్ట్ర విద్యాశాఖ మంత్రితో రాజీనామా చేయించాల్సిందే అన్నారు.ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా పార్టీ అధ్యక్షులు దేవినేని అవినాష్, మాజీ ఎమ్మెల్యేలు వెల్లంపల్లి శ్రీనివాస్, మల్లాది విష్ణు, నల్లగట్ల స్వామిదాస్, ఎమ్మెల్సీ రుహుల్లా, ఇన్చార్జులు తన్నీరు నాగేశ్వరరావు, మాజీ మేయర్ రాయన భాగ్యలక్ష్మి, జిల్లా యువజన విభాగం విద్యార్థి విభాగం అధ్యక్షులు కొరివి చైతన్య,కోమల్ సాయి- రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్





రవిచంద్ర, పలువురు మాజీ కార్పొరేటర్లు స్థానిక వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# తెలంగాణ సాధనలో జైపాల్ రెడ్డి సేవలు చిరస్మరణీయం

## -- బండి రమేష్



ఐ ఎన్ బి టైమ్స్ కూకట్పల్లి ప్రతినిధి జూలై 28

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం విశేషంగా కృషి చేసిన మాజీ కేంద్ర మంత్రి జైపాల్ రెడ్డి 8వ వర్ధంతి సందర్భంగా కూకట్‌పల్లి ఏ బ్లాక్ అధ్యక్షుడు నాగిరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. బాలానగర్ వెంకటేశ్వర్ నగర్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి టీపీసీసీ ఉపాధ్యక్షులు, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి, తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ ముఖ్య అతిథిగా హాజరై జైపాల్ రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ, జైపాల్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పార్లమెంట్‌లో తనదైన శైలిలో బలంగా గళం విప్పారని అన్నారు. అపారమైన రాజకీయ అనుభవం, విశ్లేషణా సామర్థ్యంతో దేశ రాజకీయాల్లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఆయన నిజమైన ప్రజానాయకుడని కొనియాడారు. రాజకీయ చతురుడిగా, ట్రబుల్ షూటర్‌గా పేరొందిన జైపాల్ రెడ్డి ఎలాంటి క్లిష్ట సమస్య వచ్చినా చాకచక్యంగా పరిష్కార మార్గాన్ని చూపే నాయకుడని పేర్కొన్నారు.

తెలంగాణ ఆకాంక్షను జాతీయ స్థాయిలో బలంగా వినిపించడంలో, రాష్ట్ర ఏర్పాటుకు అనుకూల వాతావరణం కల్పించడంలో జైపాల్ రెడ్డి పాత్ర ఎంతో కీలకమైందని బండి రమేష్ గుర్తు చేశారు. ఆయన ప్రజాసేవ, రాజకీయ విలువలు, నిబద్ధత నేటి తరానికి ఆదర్శమని అన్నారు.ఈ కార్యక్రమంలో పుష్ప రెడ్డి, తూము సంతోష్, పులి శివగౌడ్, చంద్ర, నాగార్జున, క్రాంతి, నర్సింగ్, రాము, రమణ, జ్యోతి, శ్రీనివాస్, పార్వతి, ముస్తఫా తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని జైపాల్ రెడ్డి కి ఘనంగా నివాళులర్పించారు.


# పంటలకు బీమా చేయించుకోవాలని పలు గ్రామాలలో పొలం పిలుస్తుంది



ఐ ఎన్ బి టైమ్స్ నందిగామ జూలై 28:

పత్తి మొక్కజొన్న అపరాలు పంటలకు బీమా చేయించుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులు మంగళవారం సూచించారు మండల పరిధిలోని తక్కెళ్ళపాడు అడవిరావులపాడు గ్రామ పొలం పిలుస్తుంది కార్యక్రమంలో వ్యవసాయ శాఖ శాస్త్రవేత్తలతో పంట పొలాలను పరిశీలించారు అనంతరంరైతులతో సమావేశం అయ్యారుపంట పొలాలను పరిశీలించి రైతులకు తగు సూచనలు చేశారు ప్రతి రైతు విధిగా తమ పంటకు బీమా చేయించుకోవాలని ప్రధానమంత్రి పంటల భీమ ద్వారా రైతులకు కలిగే రక్షణ గురించి వరించారుఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్, ఐ.కే. శ్రీనివాస్ డిప్యూటీ డైరెక్టర్ (వెటర్నరీ) కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డా. రవి కిషోర్ డా. శివప్రసాద్ , అడవిరావులపాడు వెటర్నరీ డాక్టర్ ,మండల వ్యవసాయ అధికారి జి. నాగేశ్వరరావు మండల హార్టికల్చర్ అధికారి వర్ధిని , విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు, విలేజ్ వెటర్నరీ అసిస్టెంట్లు మరియు అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా అధికారులు రైతులతో పలు ముఖ్యమైన అంశాలపై చర్చించారు. ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఆరుతడి పంటల సాగు, వాటి యాజమాన్య పద్ధతులు, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు.అదేవిధంగా ప్రధానమంత్రి పంటల బీమా పథకం ప్రయోజనాలు, పంటల బీమా ద్వారా రైతులకు కలిగే రక్షణ గురించి వివరించి, అర్హులైన రైతులు తప్పనిసరిగా బీమా చేయించుకోవాలని సూచించారు.ప్రస్తుతం రైతులకు అవసరమైన అన్ని రకాల ఎరువులు సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయని, అప్లికేషన్ ద్వారా మాత్రమే ఎరువుల పంపిణీ జరుగుతోందని రైతులకు తెలియజేశారు.మండల హార్టికల్చర్ అధికారి వర్ధిని గారు మిరప నారుమడిలో తీసుకోవాల్సిన యాజమాన్య చర్యలు, వ్యాధులు, పురుగుల నివారణ మరియు నాణ్యమైన నారు తయారీపై రైతులకు విలువైన సూచనలుఅందించారు.కార్యక్రమం అనంతరం అధికారులు రైతులతో కలిసి పొలాలను సందర్శించి పత్తి పంటలను పరిశీలించి, పంట పరిస్థితులను అంచనా వేసి అవసరమైన సాంకేతిక సూచనలు అందించారు.

# కేయూ వీ సీ ప్రతాపరెడ్డికి గుండెపోటు



ఐ ఎన్ బి టైమ్స్ హనుమకొండ జూలై 28: కాకతీయ విశ్వవిద్యాలయం ఉపకులపతి కర్నాటి ప్రతాపరెడ్డి మయో కార్డియాల్ ఇన్ఫెక్షన్ (గుండెపోటు)కు గురయ్యారు. దీంతో హనుమకొండ సుబేదారి లోని రోహిణి ఆసుపత్రిలో చేర్పించారు. వైద్యులు యాంజియోగ్రామ్ తో పాటు ఇతర గుండె సంబంధిత పరీక్షలు నిర్వహించి స్టంట్ అమర్చినట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యుల పర్యవేక్షణలో చికిత్స కొనసాగుతుంది అని తెలిపారు.

# మినీ ల్యాబ్ లు మీ చెంతకే విద్యార్థులు సద్వినియోగం చేసుకోండి

**- ప్రయోగాల ద్వారా నైపుణ్యాల సాధనకు సైన్స్ కిట్ల పంపిణీ**

**-జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**



ఐ ఎన్ బి టైమ్స్ విజయవాడ జూలై 28 :

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించి, ప్రయోగాత్మక అభ్యాసాన్ని ప్రోత్సహించేందుకు సైన్స్ ప్రయోగ కిట్లను అందజేస్తున్నామని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. మంగళవారం విజయవాడ అర్బన్ పరిధిలోని సీవీఆర్ మునిసిపల్ హైస్కూల్‌లో ఆంధ్రప్రదేశ్ శాస్త్ర సాంకేతిక మండలి (ఆప్కాస్ట్) సౌజన్యంతో పాఠశాల విద్యాశాఖ, సమగ్రశిక్ష, లీప్, ఎస్‌సీఈఆర్‌టీ, జెనీ సైన్స్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో 100 పాఠశాలలకు సైన్స్ జెనీ బాక్స్ కిట్లను పంపిణీ చేశారు. ఈ కిట్లను ఉపయోగించడంపై సైన్స్ ఉపాధ్యాయులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ గౌరవ ముఖ్యమంత్రి, గౌరవ ఉప ముఖ్యమంత్రి, గౌరవ విద్యాశాఖ మంత్రి దిశానిర్దేశానికి అనుగుణంగా ప్రభుత్వం బడుల్లో మెగా పీటీఎం, గ్రీన్ పాస్‌పోర్టు, 100 రోజుల కార్యాచరణ వంటి వినూత్న కార్యక్రమాలను అమలుచేస్తూ మంచి ఫలితాలు సాధిస్తున్నామన్నారు. పాఠశాలల్లో ప్రయోగాత్మక విద్యను అందించేందుకు ల్యాబ్స్ అందుబాటులో ఉన్నాయని.. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులను భౌతిక రసాయన జీవశాస్త్రాల అంశాలపై ఆసక్తి,తో ఆవిష్కరణల దిశగా నడిపించేందుకు ఆప్కాస్ట్ సహకారంతో సైన్స్ కిట్లను అందజేయడం జరుగుతోందన్నారు. జెనీ సైన్స్ స్టార్టప్ ను రతన్ టాటా ఇన్నొవేషన్ హబ్ (ఆర్‌టీఐహెచ్) కూడా ప్రోత్సహించినట్లు తెలిపారు. మేకిన్ ఇండియా, ఆత్మనిర్భర్ భారత్, మేకిన్ ఆంధ్రాకు ఈ స్టార్టప్ రూపొందించిన సైన్స్ కిట్లు మంచి ఉదాహరణ అని పేర్కొన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను, అవకాశాలను సద్వినియోగం చేసుకొని విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు.స్టూడెంట్ సైంటిస్టులపై ప్రత్యేక దృష్టి: డా. కె.శరత్ కుమార్, మెంబర్ సెక్రటరీ, ఆప్కాస్ట్మనచుట్టూ ఉన్న పరిసరాల్లో వివిధ అంశాలకు సంబంధించి ప్రశ్నలు వేయడం, వాటిని శాస్త్రీయ పద్ధతిలో పరీక్షించడం, స్వయంగా ప్రయోగాలు నిర్వహించడం ద్వారా విజ్ఞానాన్ని ఆర్జించి, ఆవిష్కరణల దిశగా వెళ్లేలా స్టూడెంట్ సైంటిస్టులపై ప్రత్యేక దృష్టిపెడుతున్నట్లు ఆప్కాస్ట్ సభ్య కార్యదర్శి డా. కె.శరత్ కుమార్ అన్నారు. గౌరవ ఉప ముఖ్యమంత్రి సారథ్యంలో రాష్ట్ర పర్యావరణం, అడవులు, శాస్త్ర సాంకేతిక శాఖ ఆధ్వర్యంలో శాస్త్రసాంకేతిక మండలి సమాజంలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడం, గ్రామీణ, పట్టణ ప్రాంతాల విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు కృషిచేస్తున్నట్లు తెలిపారు.

జెని బాక్స్ కిట్ల ద్వారా 40 రకాల ప్రయోగాలు చేసేందుకు వీలవుతుందని.. ఈ ప్రయోగాలు విద్యార్థుల్లో కొత్త ఆలోచనలను రేకెత్తించి పరిశోధనాత్మక దృక్పథాన్ని పెంపొందించి నూతన ఆవిష్కరణ దిశగా నడిపించేందుకు అవకాశం కల్పిస్తాయన్నారు. కార్యక్రమంలో భాగంగా నేషనల్ చిల్డ్రన్ సైన్స్ కాంగ్రెస్ 2026 పోస్టర్లను ఆవిష్కరించారు. పదేళ్ల నుంచి 17 ఏళ్ల వయసుగల విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఈ సందర్భంగా అతిథులు సూచించారు.ఈ కార్యక్రమంలో విద్యాశాఖ ఆర్‌జేడీ జి.నాగమణి, డీఈవో ఎల్.చంద్రకళ, సమగ్రశిక్షఏపీసీ ఆర్.రమేష్ బాబు, జెనీసైన్స్ వ్యవస్థాపకులు ప్రమోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# పంటల బీమా నమోదుకు మరో మూడు రోజులే గడువు..

**దుర్గి మండల రైతులకు వ్యవసాయ శాఖ విజ్ఞప్తి**



ఐ ఎన్ బి టైమ్స్ దుర్గి జూలై 28:

దుర్గి మండల రైతులందరూ 2026 ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటలకు ఈ నెల 31వ తేదీలోగా తప్పనిసరిగా పంటల బీమా (క్రాప్ ఇన్సూరెన్స్) నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి వై. అమిర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో పంటలు దెబ్బతినే అవకాశం ఉన్నందున రైతులు పంటల బీమా సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ముఖ్యంగా చిన్న, సన్నకారు రైతులు, ఎస్సీ, ఎస్టీ రైతులు ఈ పథకంలో తప్పనిసరిగా నమోదు చేసుకుని ప్రకృతి వైపరీత్యాల వల్ల కలిగే ఆర్థిక నష్టాల నుంచి రక్షణ పొందాలని కోరారు.

పత్తి -- ?1,900 మిరప --?360 కంది--?40 వరి--?80

రైతులు చివరి తేదీ వరకు వేచి ఉండకుండా అవసరమైన పత్రాలతో సంబంధిత కేంద్రాల్లో వెంటనే ప్రీమియం చెల్లించి పంటల బీమా నమోదు పూర్తి చేసుకోవాలని సూచించారు.

గమనిక:పత్తి, మిరప, కంది పంటలకు జూలై 31 చివరి తేదీ కాగా, వరి పంటకు మాత్రం ఆగస్టు 15, 2026 వరకు ప్రీమియం చెల్లించి బీమా నమోదు చేసుకునే అవకాశం ఉందని మండల వ్యవసాయ అధికారి వై. అమిర్ రెడ్డి తెలిపారు. దుర్గి మండలంలోని ప్రతి రైతు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## శాంతియుత నిరసనలు తెలిపే హక్కు ఉంది

న్యూఢిల్లీ,జులై 27 నీట్ పేపర్ లీక్ కేసుకు సంబంధించి విద్యార్థులపై జరిగిన లాఠీచార్జ్ వ్యవహారంపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును కల్పిస్తుందని, కేవలం నిరసన వ్యక్తం చేస్తున్నారనే కారణంతో పోలీసు బలప్రయోగానికి పాల్పడకూ డదని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. జూలై 20న 'సంసద్ చలో' కార్యక్రమంలో భాగంగా నీట్ పేపర్ లీక్ కేసుపై న్యాయం కోరుతూ విద్యార్థులు నిర్వహించిన నిరసన సందర్భంగా పోలీసులు లాఠీచార్జ్ చేయడంతో పాటు టియర్ గ్యాస్ ప్రయోగించారు.




## దేశ విభజన నేపథ్యంలో సన్నీ డియోల్ ‘బట్వారా 1947’..


బాలీవుడ్ యాక్షన్ స్టార్ సన్నీ డియోల్ నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ హిస్టారికల్ డ్రామా ‘బట్వారా 1947’ (దీఫ్‌ఝుతీఝ 1947) నుంచి క్రేజీ అప్‌డేట్ వచ్చింది. తాజాగా ఈ సినిమా నుంచి ట్రైలర్‌ను విడుదల చేశారు మేకర్స్. దేశ విభజన నాటి భయానక పరిస్థితులు, ద్వేషం మధ్య ఒక వ్యక్తి చూపించిన అసాధారణ ధైర్యం నేపథ్యంలో సాగే భావోద్వేగభరిత చిత్రంగా ఈ చిత్రం రాబోతున్నట్లు ట్రైలర్ చూస్తే అర్థమవుతుంది. ఇక ఈ చిత్రాన్ని స్వాతంత్ర్య దినోత్సవ కానుకగా 2026, ఆగస్టు 14న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది.గతంలో ‘ఘాయల్’, ‘దామిని’, ‘ఘాతక్’ వంటి ఇండస్ట్రీ హిట్లను అందించిన స్టార్ డైరెక్టర్ రాజ్‌కుమార్ సంతోషి, సన్నీ డియోల్ కాంబినేషన్‌లో చాలా ఏళ్ల తర్వాత వస్తున్న సినిమా కావడంతో దీనిపై భారీ అంచనాలు ఉన్నాయి. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌ను మిస్టర్ పర్ఫెక్ట్ ఆమిర్ ఖాన్ తన ‘ఆమిర్ ఖాన్ ప్రొడక్షన్స్’ బ్యానర్‌పై అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తుండటం విశేషం. నటిస్తుండగా, శబానా అజ్మీ, అలీ ఫజల్, కరణ్ డియోల్, కనికా కపూర్, సర్గమ్ సింగ్, ఖుషీ హజారే కీలక పాత్రలు పోషిస్తున్నారు.

## దేశాన్ని కుదిపేసిన ‘ఫ్రీడమ్ 251’ స్కామ్ నేపథ్యంలో ‘ఆజాదీ 501’.. ఆసక్తికరంగా ట్రైలర్!




కేవలం రూ.251కే స్మార్ట్‌ఫోన్ అందిస్తామంటూ ‘ఫ్రీడమ్ 251’ పేరుతో కొన్నేళ్ల క్రితం దేశవ్యాప్తంగా జరిగిన అతిపెద్ద డిజిటల్ స్కామ్ ఆధారంగా తెలుగులో ‘ఆజాదీ 501’ అనే వెబ్ సిరీస్ రాబోతుంది. రూ.20 వేలు సంపాదించే ఒక సాధారణ మధ్యతరగతి కుర్రాడు రూ.501కే ఫోన్ ఇస్తానని చెప్పే ఆలోచన, దాని వెనుక ఉన్న ఆశయాలు, ఆ తర్వాత చోటుచేసుకున్న అనూహ్య పరిణామాలు మరియు కార్పొరేట్ మోసం నేపథ్యంలో ఈ టెక్ డ్రామాను మేకర్స్ రూపొందించారు.శివతేజ దర్శకత్వం వహించిన ఈ వెబ్ సిరీస్‌లో తేజ కాట్రగడ్డ, హర్షవర్ధన్, గీతా భాస్కర్, శశాంక్, రవివర్మ తదితరులు ముఖ్య పాత్రలు పోషించారు. థర్స్ డే సినిమాస్ బ్యానర్‌పై రచన రెడ్డి ములుముడి నిర్మించిన ఈ క్రైమ్ థ్రిల్లర్ సిరీస్ ట్రైలర్ ప్రేక్షకులలో అమితమైన ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఇక ఈ క్రేజీ ప్రాజెక్ట్‌ను జూలై 29 నుంచి ప్రముఖ తెలుగు ఓటీటీ ప్లాట్‌ఫామ్ ‘ఆహా’లో స్ట్రీమింగ్ చేయబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది.

## ‘ది ప్యారడైజ్’లో కీర్తి ద సురేష్ మాస్ స్టెప్పులు ..




ఖవవతీష్ట్రఎ ాబతీవంష్ట్ర। నేచురల్ స్టార్ నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ పాన్ ఇండియా చిత్రం ది ప్యారడైజ్ పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ‘దసరా’ వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత వీరిద్దరి కాంబోలో వస్తున్న సినిమా కావడంతో అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో సినిమాకు సంబంధించిన ఓ వార్త ఇప్పుడు ఫిలింనగర్‌లో చర్చనీయాంశంగా మారింది. తాజా ప్రచారం ప్రకారం, ఈ చిత్రంలో ఉండే ఓ హై-వోల్టేజ్ మాస్ స్పెషల్ సాంగ్ కోసం జాతీయ అవార్డు గ్రహీత కీర్తి సురేష్‌ను తీసుకోవాలని మేకర్స్ ఆలోచిస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. అయితే దీనిపై ఇప్పటివరకు చిత్రబృందం నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు.



## క్యారవాన్‌లోకి వచ్చి చొక్కా విప్పేశాడు.. షూటింగ్ సెట్‌లో చేదు అనుభవాన్ని గుర్తుచేసుకున్న కాజల్!

ప్రముఖ కథానాయిక కాజల్ అగర్వాల్ షూటింగ్ సెట్‌లో తనకు ఎదురైన ఒక భయంకరమైన సంఘటనను గుర్తుచేసుకుంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల ఓ సినిమా షూటింగ్ పూర్తయ్యాక తాను క్యారవాన్‌లో విశ్రాంతి తీసుకుంటుండగా, అదే చిత్రంలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న ఒక వ్యక్తి ఎలాంటి అనుమతి తీసుకోకుండా, కనీసం తలుపు కూడా కొట్టకుండా లోపలికి వచ్చేశాడని ఆమె తెలిపారు. ఆ తర్వాత అతడు వెంటనే తన చొక్కా విప్పి, ఛాతీపై ఉన్న కాజల్ పేరు టాటూను చూపించాడని, ఆ హఠాత్ పరిణామానికి తన కాళ్లు చేతులు వణికిపోయాయని కాజల్ వెల్లడించారు.సంతోషమే అయినా, ఒక మహిళ ఒంటరిగా ఉన్నప్పుడు అనుమతి లేకుండా క్యారవాన్‌లోకి రావడం ఏమాత్రం సరికాదని ఆమె అభిప్రాయపడ్డారు. ఎంత పెద్ద అభిమాని అయినా ఇటువంటి ప్రవర్తనను ఎంతమాత్రం సహించలేమని, ఇలాంటి పనులు చేస్తే క్రిమినల్ కేసులు నమోదు అవుతాయని హెచ్చరించి అతడిని అక్కడి నుంచి పంపించి వేసినట్లు కాజల్ చెప్పారు. 2004లో హిందీ చిత్రం ‘క్యూన్! హో గయా నా’తో అరంగేట్రం చేసిన కాజల్, ఎస్.ఎస్. రాజమౌళి దర్శకత్వంలో వచ్చిన ‘మగధీర’ చిత్రంతో స్టార్ హీరోయిన్‌గా మారిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత డార్లింగ్, బృందావనం, మిస్టర్ పర్ఫెక్ట్, బిజినెస్‌మ్యాన్, నాయక్, బాద్‌షా, ఎవడు, టెంపర్ వంటి బ్లాక్‌బస్టర్ చిత్రాలతో అలరించడమే కాకుండా బాలీవుడ్‌లో ‘సింగం’, ‘స్పెషల్ 26’ చిత్రాలతో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు.

## నా పేరుతో తప్పుడు ప్రచారం చేస్తున్నారు..



రిజర్వేషన్ల అంశంపై తన పేరుతో సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న పోస్టులు పూర్తిగా అబద్ధమని, తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని నటి శిల్పా శెట్టి తీవ్రంగా ఖండించారు.

ఈ మేరకు ఆమె ఎక్స్ వేదికగా ఒక ప్రకటన విడుదల చేస్తూ.. తన పేరును ఉపయోగిస్తూ కొందరు కావాలని నిందలు వేస్తున్నారని, అది పూర్తిగా కల్పితమైన వార్త అని స్పష్టం చేశారు. నా పేరును ఉపయోగిస్తూ రిజర్వేషన్లపై వైరల్ అవుతున్న తప్పుడు ప్రకటనలు చూసి తీవ్ర షాక్‌కు గురయ్యాను. ఇది పూర్తిగా కల్పితం మరియు దుర్బుద్ధితో కూడిన చెత్త ప్రచారం. ఇలాంటి ఫేక్ న్యూస్‌ను ఎవరూ నమ్మకండి అంటూ శిల్పా రాసుకోచ్చింది.

రిజర్వేషన్ వ్యవస్థను ఉద్దేశించి వైద్యులు, కులాల ఆధారంగా రోగులకు చికిత్స చేయాలంటూ శిల్పా శెట్టి ఇన్‌స్టాగ్రామ్ స్టోరీ పెట్టినట్లుగా ఒక స్క్రీన్‌షాట్ నెట్టింట తీవ్ర కలకలం రేపింది. అయితే ఈ వివాదం ముదరకముందే శిల్పా స్పందించి ఆ వార్తలకు తెరదించింది. ఇక సినిమాల విషయానికొస్తే, శిల్పా శెట్టి ఇటీవల ధ్రువ సర్జా, సంజయ్ దత్, రవిచంద్రన్ ప్రధాన పాత్రల్లో నటించిన ‘కేడీ: ది డెవిల్’ అనే కన్నడ చిత్రంలో కనిపించారు.

ప్రస్తుతం ఆమె ‘మా హై నా’ అనే ప్రముఖ రియాలిటీ కుకింగ్ షోకి వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్నారు.

## జయం రవికి కోర్టులో ఊరట..



కోలీవుడ్ స్టార్ నటుడు జయం రవి (రవి మోహన్), ఆయన భార్య ఆర్తి మధ్య కొనసాగుతున్న విడాకుల వ్యవహారం మరో కీలక మలుపు తిరిగినట్లు తెలుస్తోంది. గత కొంతకాలంగా పరస్పర ఆరోపణలు, లీగల్ నోటీసులు, వ్యక్తిగత వ్యాఖ్యలతో వార్తల్లో నిలిచిన ఈ కేసులో తాజాగా చెన్నై ఫ్యామిలీ కోర్టు కీలక నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ముఖ్యంగా భరణం, పిల్లల సంరక్షణకు సంబంధించిన అంశాలపై వచ్చిన ఈ పరిణామాలు ప్రస్తుతం సినీ వర్గాల్లో, సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి. సమాచారం ప్రకారం, విడాకుల కేసు విచారణ పూర్తయ్యే వరకు తన జీవన వ్యయాల కోసం ప్రతి నెలా రూ.40 లక్షలు తాత్కాలిక భరణంగా ఇవ్వాలని ఆర్తి కోర్టును కోరినట్లు ప్రచారం జరిగింది. ఈ అంశం అప్పట్లో సోషల్ మీడియాలో కూడా విస్తృత చర్చకు దారితీసింది.

అయితే అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం, కోర్టు ఆ భారీ మొత్తాన్ని ఆమోదించకుండా, కేసు విచారణ పూర్తయ్యే వరకు ప్రతి నెలా రూ.3 లక్షలు తాత్కాలిక భరణంగా చెల్లించాలని ఆదేశించినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఈ విషయంపై కోర్టు పూర్తి ఉత్తర్వులు లేదా అధికారిక పత్రాలు ఇప్పటివరకు బహిరంగంగా విడుదల కాలేదు. భరణం అంశంతో పాటు పిల్లల సంరక్షణకు సంబంధించిన విషయంపైనా కోర్టు కీలక నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. నిర్దిష్ట నిబంధనలకు లోబడి జయం రవి తన పిల్లలను కలిసేందుకు అనుమతి ఇచ్చినట్లు తెలుస్తోంది. గతంలో పిల్లలను కలిసే అవకాశంపై వివాదం నెలకొన్న నేపథ్యంలో ఈ నిర్ణయం ప్రాధాన్యత సంతరించుకుంది.ఈ పరిణామంతో జయం రవికి ఆర్థిక పరంగా కొంత ఉపశమనం లభించినట్లుగా సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. భారీ మొత్తంలో భరణం చెల్లించాల్సి వస్తే అది ఆయనపై గణనీయమైన ఆర్థిక భారం అయ్యేదని కొందరు అభిప్రాయపడుతున్నారు.